క్లుప్తంగా

చంద్రబాబు హామీని అమలు చేయాలి

నూజివీడు: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నూజివీడు ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ మంగళవారం డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారం చేపట్టి నెలరోజులు గడిచినా దీనిపై రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశాల్లో లేదా ప్రజా సదస్సుల్లో ప్రస్తావించకపోవడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. గతంలో నూజివీడును ఏలూరు జిల్లాలో కలపొద్దని వామపక్షాల ఆధ్వర్యంలో పాదయాత్ర సైతం చేశామని గుర్తుచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని హరినాథ్ కోరారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



నూజివీడు: వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉన్నప్పుడే ఆహారం తినాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని 11 వార్డులో మంగళవారం స్టాప్ డయేరియా ర్యాలీ నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై దోమలు, ఈగలు వాలకుండా చూసుకోవాలని, నిల్వ ఉంచిన మాంసాన్ని తినవద్దని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబు



జి.కొండూరు: వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జి. మోహన్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి సరఫరా, డ్రెయినేజీల పూడికతీత వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ



తిరువూరు: స్థానిక పాత తిరువూరు ఎంపీయూపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థి చాట్ల రాజు కంప్యూటర్, ఇనుప గేటు వితరణగా ఇచ్చారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఎంఈఓలు రామకృష్ణ, శ్యాంసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ రాంబాబు పాల్గొన్నారు.

నరసింహారావుపాలెంలో వైద్య శిబిరం

చాట్రాయి: మండలంలోని నరసింహారావుపాలెంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రతగా పీహెచ్‌సీ వైద్యులు దుర్గా ప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, నొప్పులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మిషన్ శక్తి పథకంపై అవగాహన

ఆగిరిపల్లి: మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే మిషన్ శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ సీడీపీఓ నూరాని అన్నారు. మంగళవారం స్థానిక కొండ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల తల్లులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పించారు. మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కల్పించడం, వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడడం ఈ పథకం ఉద్దేశమని నురాని వివరించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండర్ బి.దాసు మానవ హక్కులు, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్లు రాగమయి, సులోచనా రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమ్మతుల కోసం ఎదురుచూపులు



తిరువూరు-అడసర్ల పాడు ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతలు



వర్షం నీరు చేరి చెరువును తలపిస్తున్న తిరువూరు ప్రధాన రహదారి (ఫైల్)

- గుంతలమయంగా రహదారులు
- వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల వినతి

తిరువూరు: నియోజకవర్గంలోని పలు రహదారులు గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీళ్లు నిలవడంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని తప్పించే క్రమంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తిరువూరు నుంచి కోకిలంపాడు మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని అడసర్లపాడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రివేళల్లో గుంతల్లో పడి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత రెండు నెలల్లోనే ఈ రహదారిపై పదికి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. తిరువూరు మెయిన్ రోడ్డు సైతం నిర్వహణా లోపంతో గుంతల కారణంగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు తీవ్రతరం

వర్షాకాలంలో బస్టాండ్ సెంటర్, రాజుపేట, బైపాస్ రోడ్డు వినాయకుని గుడి సెంటర్లలో రోడ్డుపై నీరు నిలిచి వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలలో పూడిక పేరుకుపోవడంతో వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఆర్ అండ్ బీ, నగర పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే రహదారి సైతం గత 10 సంవత్సరాలుగా నిర్వహణా లోపంతో రాకపోకలకు వీలులేని విధంగా ఉంది. గ్రామస్తులు తిరువూరు నుంచి మునుకుళ్ల మీదుగా ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లవలసి వస్తోంది.



రోడ్లు నిర్మించాలి

తిరువూరు మండలంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వీటి నిర్వహణకు నిధులు కేటాయించి సత్వరం మరమ్మతులు చేయాలి. అవసరమైన చోట్ల రహదారులను పునర్నిర్మించాలి. వర్షాకాలంలో ధ్వంసమైన వంతెనలు, రోడ్లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– మాలపాటి ఉదయ్, తిరువూరు



నిధులు కేటాయించాలి

ఆర్ అండ్ బీ రహదారులు, గ్రామీణ రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నందున అధికారులు వెంటనే అత్యవసర మరమ్మతులు చేయించాలి. వాహన చోదకులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నందున ప్రభుత్వం నిధులు కేటాయించి రోడ్డు పనులు ప్రారంభించాలి.

– బి. వెంకటేశ్వరరావు, తిరువూరు

జగన్‌పై అక్రమ కేసులు హేయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరావు



మీడియాతో మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

మైలవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రస్తుత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రిపై కూడా కక్షపూరితంగా వ్యవహరిస్తూ తప్పుడు కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రఘురామ కృష్ణరాజు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పెట్టిన కేసులను తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరారు. ఇప్పటి వరకు తల్లికి వందనం పథకంపై కూటమి ప్రభుత్వం సరైన విధి విధానాలను ప్రకటించకుండా జాప్యం చేస్తోందన్నారు. రైతు భరోసా ఊసేలేదని, ఇసుక ఫ్రీ అని చెప్పి వినియోగదారుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నారని విమర్శించారు.

మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని సర్నాల డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అప్పిడి సత్యనారాయణరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరత్నం, మైలవరం సర్పంచ్ మంజుభార్గవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగాంజనేయులు

మైలవరం: యువతలో నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకుని కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నాగాంజనేయులు వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ వేగంగా పెరుగుతున్న జాబ్ మార్కెట్, సరైన నైపుణ్యాలతో యువతకు సాధికారత కల్పించడం, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కొరకు వివిధ రకాల కోర్సులను నేర్చుకోవటం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. పరిశ్రమల నిర్వాహకులు ప్రపంచ సంస్థలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు అభ్యాసాన్ని మెరుగు పరిచే, ప్రతిభావంతమైన కెరియర్ కోసం ఉపయోగపడుతుందన్నారు. డిజిటల్ యుగం నేటి యువతకు అద్భుతమైన అవకాశాలను అందిస్తోందని, యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఎలా ఉండాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ ఆర్.సవిత, ఎన్‌సీసీ విభాగపు ఇన్‌చార్జీలు, ఎన్‌సీసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

సుజలాం ప్లాంట్ల మూసివేతతో ప్రజల ఇక్కట్లు



తిరువూరులో మూతపడిన మంచినీటి ప్లాంట్

తిరువూరు: తక్కువ ధరకు తాగునీరందించే సుజలాం మంచినీటి ప్లాంట్లను మూసివేయడంతో తిరువూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వైష్ణవ బజారు, భగత్‌సింగ్ నగర్ కాలనీలలో సుజలాం ప్లాంట్లను ఏర్పాటు చేశారు. 20 లీటర్ల మంచినీటి క్యాన్ రూ.5కు విక్రయించడంతో పేద ప్రజలకు ప్రయోజనకరంగా ఉంది. ఎన్నికల అనంతరం ఈ ప్లాంట్లను నగర పంచాయతీ అధికారులు మూసివేశారు. గతంలో వీటిని వైఎస్సార్ సీపీకి చెందినవారు నిర్వహిస్తుండటంతో వారిని తొలగించి ప్లాంట్లను మూసివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ప్లాంట్లను తిరిగి తెరిచి మంచినీరు సరఫరా చేయాలని కోరుతున్నారు. నిర్వహణ పనుల నిమిత్తం వీటిని తాత్కాలికంగా మూసివేశామని, త్వరలో తిరిగి ప్రారంభిస్తామని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు తెలిపారు.

ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి

మునుకూరు: పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులందరూ ప్రభుత్వ సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక అన్నారు. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం మునుకూరులోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. మామిడి, కొబ్బరి, కోకో, ఆయిల్ పామ్, నిమ్మ తదితర పండ్ల తోటలతో పాటు, కూరగాయల సాగు రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి, సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పథకాలపై అవగాహన కోసం, సందేహాల నివృత్తి కోసం రైతు సేవా కేంద్రాల్లో ఇన్‌చార్జీలను, ఉద్యాన శాఖాధికారిని రైతులు సంప్రదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

23 నుంచి ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

తిరువూరు: మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు ఈ నెల 23 నుంచి నిర్వహిస్తామని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. 23, 24 తేదీల్లో ఎర్రమాడు ఎంపీయూపీ స్కూల్లో, 25, 26 తేదీల్లో ముష్టికుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 27న అక్కపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఈ శిబిరాలు జరుగుతాయని, ఆధార్ నవీకరణ, సవరణ, ఆధార్‌కు ఫోన్ లింక్ చేయడం తదితరాలు ఈ శిబిరాల్లో నిర్వహించుకోవచ్చని వివరించారు.

- **ఇబ్రహీంపట్నం:** మండలం పరిధి గ్రామాల్లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిబిరాల్లో ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం, అందుకు అవసరమైన ఫారాలు జత చేయడం, 0–5 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు, అప్‌డేట్ నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలి

సీపీఐ నాయకుల డిమాండ్



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరువూరు: తిరువూరు పట్టణంలో అధ్వానంగా ఉన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే రహదారులు సైతం గోతుల మయంగా మారడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పట్టణంలోని పలు రహదారులు గోతులమయమై రాకపోకలకు వీలులేకపోవడంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటికి మరమ్మతులు చేయించాలని ఆర్ అండ్ బీ, నగర పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఉదయ్, నాయకులు నాగుల్‌మీరా, అశోక్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మైలవరం: రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ మైలవరం మండల అధ్యక్షుడు పి. గోపాల్ విజ్ఞప్తి చేశారు. మైలవరం సబ్ ట్రెజరీ కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారి నాగ వెంకట సత్యనారాయణను మంగళవారం కలిసి ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రిటైర్డ్ ఉపాధ్యాయులకు పెన్షన్ పుస్తకాలు వెంటనే అందజేయాలని, ట్రెజరీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఎరియర్ బిల్లులు వెంటనే పరిష్కరించి విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోలా రాఘవరాజు పాల్గొన్నారు.

జల్ జలాలే సాహెబ్ పంజా వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న మహ్మద్ అల్తాఫ్‌రజా తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మొహర్రం పండుగను పురస్కరించుకుని కొండపల్లి జల్ జలాలే సాహెబ్ పంజా వద్ద సోమవారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సూఫీ మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రజా, పలువురు కూటమి నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్తాఫ్‌రజా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ సత్యం, ధర్మం కోసం మహ్మద్ ప్రవక్త వంశస్తులు 72 మంది కొన్ని రోజుల పాటు ధర్మ పోరాటం చేసి అసువులు బాశారన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు పది రోజుల పాటు సంతాప దినాలు పాటించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. బుధవారం భారీ ఊరేగింపుతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని చెప్పారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వేపై శిక్షణ



ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి

తిరువూరు: కుష్ఠువ్యాధి బారిన పడిన వారు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఈ వ్యాధిని నివారించవచ్చని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మా బేగం అన్నారు. స్థానిక యూపీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు కుష్ఠు వ్యాధి నిర్ధారణ పక్షోత్సవాల సందర్భంగా శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి ఆగస్ట్ 2వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వ్యక్తులను గుర్తించి అనుమానితులకు ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. స్పర్శలేని రాగి రంగులో మచ్చలు శరీరంపై ఉంటే కుష్ఠు వ్యాధి లక్షణమని గుర్తించాలని, చర్మం పొడి బారడం, మచ్చలపై వెంట్రుకలు రాలిపోవడం, చెమట పట్టకపోవడం, చెవులపై బుడిపెలు వంటి లక్షణాలు కుష్ఠు వ్యాధికి సూచనలుగా భావించవచ్చన్నారు.మందులు వాడటం ద్వారా వ్యాధి నయం అవుతుందని రేష్మాబేగం వివరించారు. శిక్షణ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె. రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ పలు అంశాలపై సూచనలిచ్చారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



చాట్రాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని నరసింహారావుపాలెం, సోమవరం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు నీరు తొలగింపు, డ్రెయిన్లలో పూడిక తీత, పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు, చెత్త కుప్పల తొలగింపు పనులు జరిగాయి. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

- **తిరువూరురూరల్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చౌటపల్లిలో సర్పంచి యరమల రాజేశ్వరి ఆధ్వర్యంలో సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించారు. ఆంజనేయపురంలో సర్పంచి మామిడి కుటుంబరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

నలుగురు జూదరుల అరెస్ట్

జి.కొండూరు: మండల పరిధి మునగపాడు గ్రామ శివారులోని మామిడితోటలో పేకాట ఆడుతున్న నలుగురిని జి.కొండూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురి నుంచి రూ.మూడు వేల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. పేకాట, కోడి పందేలు వంటి జూదాలకు పాల్పడితే ఎటువంటి వారినైనా క్షమించేది లేదని హెచ్చరించారు.

నేడు శాస్త్రీయ దృక్పథం-ఆవశ్యకతపై సదస్సు

తిరువూరు: శాస్త్రీయ దృక్పథం–ఆవశ్యకత అంశంపై బుధవారం ఉదయం 10 గంటలకు తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తామని తిరువూరు పట్టణ జేవీవీ కమిటీ తెలిపింది. సామాజిక విశ్లేషకులు వెంకట్రావు ప్రసంగిస్తారన్నారు. మేధావులు, విద్యావంతులు పాల్గొనాలని పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, సుదర్శన్ కోరారు.

జగజ్జననికి ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



అమ్మవారి ఉత్సవ మూర్తి

తరలివస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా జగజ్జననికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తబృందాలు సారె సమర్పించాయి. విజయవాడకు చెందిన శ్రీదుర్గా శివసాయి సేవా సంఘానికి చెందిన రెండు వందల మంది, రాధా మాధవి భక్త బృందానికి చెందిన వంద మంది, దుర్గా భవాని బృందానికి చెందిన 60 మంది, అరుణ బృందం 60 మంది, వంశీ బృందం 30 మంది, యనమలకుదురుకు చెందిన సోమేశ్వరరావు బృందానికి చెందిన 40 మంది ఇలా అనేక మంది భక్తులు ఇంద్రకీలాద్రికి వచ్చి సారె సమర్పించారు. విశాఖపట్నానికి చెందిన అన్నమాచార్య సేవా సమితి బృందానికి చెందిన 50 మందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి మరికొన్ని సంఘాలు ఇంద్రకీలాద్రికి విచ్చేశాయి. భక్త బృందాలకు ఆలయ ఈఓ కేఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని దర్శించుకుని సారె సమర్పించారు.